దొడ్డు రకం ధాన్యానికీ బోనస్ చెల్లించాలి

నిజాంసాగర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కామారెడ్డి, మార్చి 16 : దొడ్డు రకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని అన్నారు. ధాన్యానికి బోనస్ ఇచ్చే వరకు ఈ పోరాటం ఆగదని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవియాదవ్, బీఆర్ఎస్ నాయకులు నల్లవెల్లి అశోక్, గరిగంటి లక్ష్మీనారాయణ, భూమేశ్ యాదవ్, గైని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ టౌన్, మే 16 : బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరికి నిరసనగా రైతులతో కలిసి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ధాన్యానికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎన్నికలు ముగియగానే సన్నరకం వడ్లకు మాత్రమే బోనస్ చెల్లిస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెర్రె నర్సింహులు, సీనియర్ నాయకులు దొడ్ల వెంకట్‌రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీధర్, వాహబ్, ఎజాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఉదయ్, మండల కార్యదర్శి రాజేశ్వర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బాన్సువాడలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ధాన్యం తడిసిపోకుండా చూడాలి

అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి, మే 16 : అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు తడిసిపోకుండా చూడాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో రెవెన్యూ, జిల్లా పౌర సరఫరాల అధికారులతో ధాన్యం కొనుగోలుపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే మూడు రోజులు వర్షాలు కురిసే సూచనలున్నందున ధాన్యం రాశులను త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించాలన్నారు. మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు కూడా ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పాలన్నారు. రైతులు అధైర్యపడొద్దని కోరారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా మిల్లులకు వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్‌లోడ్ చేసుకొని పంపితే తిరిగి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ చేసి పంపడానికి అవకాశముంటుందని అన్నారు. ఈ యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 42,142 మంది రైతుల నుంచి రూ.526 కోట్ల విలువైన 2,38,488 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.441 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, ఉప తహసీల్దార్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

దోమకొండలో ఉరుములతో కూడిన వర్షం

దోమకొండ, మే 16 : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి బలమైన ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడువకుండా టార్పాలిన్ కప్పి రక్షించుకునే ప్రయత్నం చేశారు.

దోమకొండలో కురుస్తున్న వర్షం

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలు

హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగీ నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న దవాఖాన సిబ్బంది

బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డి రూరల్/ డోంగ్లీ/ రామారెడ్డి, మే 16 : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు మండలాల్లో గురువారం వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ ప్రాణాంతకమైనదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ వ్యాధి నివారణపై దవాఖాన సిబ్బంది అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం జాతీయ డెంగీ వ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో సాయిలు, ఫార్మసిస్టు రమేశ్, నర్సింగ్ అధికారిణి సుమలత, ల్యాబ్ టెక్నిషీయన్లు రాంచందర్, పండరి, హన్మాజీపేట్, కోనాపూర్ గ్రామాల ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించి, డెంగీ వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించారు. లింగంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పలువురు మాట్లాడుతూ.. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవడం ద్వారా డెంగీ వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. ఒకే ఇంట్లో అందరికీ డెంగీ సోకే ప్రమాదం ఉంటుందని అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

డోంగ్లీ ప్రభుత్వ దవాఖానలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగీని నివారిద్దాం అంటూ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలేఖ, సీహెచ్‌వో పండరి, సూపర్‌వైజర్ రవి, డీఈవో ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు. సదాశివనగర్ మండలం ఉత్తూనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం డెంగీ నివారణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నయీమొద్దీన్, యశోద, మమత, ల్యాబ్ టెక్నిషియన్ ఇంజాపురం విఠల్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

కామారెడ్డి రూరల్, మే 16 : రాష్ట్రంలో కులగణన ప్రక్రియ చేపట్టి, బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన చేపట్టి బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని ఇప్పటికే హామీ ఇచ్చారని అన్నారు. లోక్ సభ ఎన్నికలు ముగిశాక జూన్ చివరి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించిన నేపథ్యంలో కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచిన తర్వాత మాత్రమే ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేని పక్షంలో బీసీలంతా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, మే 16 : బెస్టు అవైలబుల్ స్కూల్ పథకం కింద 1వ తరగతిలో (2024-25)డే స్కాలర్ ఇంగ్లిష్ మీడియంలో, 5వ తరగతిలో రెసిడెన్షియల్‌గా ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశం కోసం అర్హులైన ఎస్సీ బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి అధికారిణి రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో ప్రవేశానికి జూన్ 1, 2018 నుంచి మే 31 2019 మధ్య జన్మించి ఉండాలన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షన్నర ఉండాలన్నారు. దరఖాస్తు వెంట జనన, కుల ధ్రువీకరణ, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌ను జతపరచాలని సూచించారు. ఆసక్తి ఉన్న బాలబాలికలు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జూన్ 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూన్ 11 న మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 8328015942 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

అన్నారంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశం

రాజంపేట్, మే 16 : ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పని చేయాలని ఎంపీడీవో రాజేశం అన్నారు. మండలంలోని అన్నారం, ఆర్గొండ గ్రామాల్లో గురువారం ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు. కొలతల ప్రకారమే డబ్బులు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో టీఏ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు రాంనివాస్, లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్లు సంతోష్, గోపి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మాచారెడ్డి, మే 16 : మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కామారెడ్డి పట్టణం నుంచి 14 కి.మీ దూరంలో సిరిసిల్లకు వెళ్లేదారిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ఉంటుంది. లక్ష్మీరావులపల్లి స్టేజీ వద్ద నుంచి సుమారు 2.కి.మీల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో చుక్కాపూర్ లక్ష్మీనృసింహున్ని ఆలయం ఉంది. ఇక్కడి నుంచి కాలినడకన వెళ్లొచ్చు. ఆటోలు కూడా అందుబాటులో ఉంటాయి.

ధాన్యాన్ని నిజామాబాద్‌కు తరలించాలి

నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ సొసైటీలో ఈ-పాస్ మిషన్ ద్వారా స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

ఎల్లారెడ్డి, మే 16: జిల్లాలోని ఐదు మండలాల్లో పెద్ద మొత్తంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని నిజామాబాద్‌కు తరలించాలని జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. జిల్లాలోని దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, పిట్లం, నిజాంసాగర్ మండలాల్లో ధాన్యం నిల్వలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. దీంతో వెంటనే నిజామాబాద్‌కు తరలించాలని ఆదేశాలు ఉన్నందున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని ఆమె సూచించారు.

ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులను సరఫరా చేయాలి..

నాగిరెడ్డిపేట, మే 16: ఈ-పాస్ మిషన్ల ద్వారానే ఎరువులను సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. నాగిరెడ్డిపేట మండలం తాండూర్, కిచ్చన్నపేట్ సొసైటీలు, ఎరువుల గోదాములు, స్టాక్ రిజిష్టర్లను ఆమె పరిశీలించారు. రెండు సొసైటీల్లో ఉన్న ఈ-పాస్ మిషన్లను పరిశీలించి, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల బ్యాగులను తప్పనిసరిగా ఈ-పాస్ మిషన్ ద్వారా, బయోమెట్రిక్ ఆధారంగా రైతుల ఆధార్ వివరాలను నమోదు చేసుకొని ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను ఏవోకు తెలుపాలన్నారు. వానకాలం సీజన్‌కు కావాల్సిన పచ్చిరొట్ట ఎరువులు 60శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆమెతోపాటు ఏవో విజయశేఖర్, తాండూర్, కిచ్చన్నపేట్ సొసైటీల సీఈవోలు పవన్, జైపాల్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు

గాంధారి మండల వ్యవసాయాధికారి నరేశ్

గాంధారిలోని ఓ దుకాణంలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఏవో నరేశ్

గాంధారి, మే 16: రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గాంధారి వ్యవసాయాధికారి నరేశ్ డీలర్లను హెచ్చరించారు. మండల కేంద్రంలోని పురుగు మందులు, విత్తనాల విక్రయ దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లోని స్టాక్ రిజిష్టర్లతో పాటు, బిల్ బుక్కులను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రశీదులు ఇవ్వాలని సూచించారు. దుకాణాల్లో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగుమందులను విక్రయించవద్దన్నారు. వానకాలంలో సంవృద్ధిగా వర్షాలు కురిసిన అనంతరం రైతులు విత్తనాలను విత్తుకోవాలని సూచించారు.

ఎల్వోసీ అందజేత

ఎల్లారెడ్డి, మే 16: నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన రాజుకు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. దీంతో ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. స్థానిక నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే నిమ్స్ దవాఖాన వైద్యులతో మాట్లాడారు. సీఎం సహాయ నిధి నుంచి రూ.95వేల విలువైన ఎల్వోసీని మంజూరు చేయించారని బాధితుడి బంధువులు తెలిపారు. వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం తడవకుండా కాపాడుకోవాలి

ఎల్లారెడ్డి, మే 16: అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవాలని తహసీల్దార్ మహేందర్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. శుక్రవారం కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పుకోవాలని, చుట్టూ నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంత త్వరగా ధాన్యం కాంటా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జూన్ వరకు మొక్కలను సిద్ధంగా ఉంచాలి

గాంధారి, మే 16: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను జూన్ నెల వరకు నాటడానికి సిద్ధంగా ఉంచాలని గాంధారి ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. మండలంలోని గుర్జాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన గురువారం సందర్శించారు. మొక్కల మధ్య తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. మొక్కలకు ప్రతిరోజూ నీరు పోసి సంరక్షించాలని, మొక్కల మధ్యలో ఉన్న కలుపు మొక్కలను తొలగించాలన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **GANGJYA NARESH S/o. Gangjya Gangadhar** R/o. 1-21-73. Housing board colony, Armoor, Nizamabad. TS Change my new Name as **REGULLA NARESH S/o. Regulla Gangadhar**
NTZ-324920

CHANGE OF NAME

I, **BOMMERA SUJATHA** (Old name) R/o.H.No.11-1-572, Chandra Shekar colony, Nizamabad. T.S., have Change my new Name as **BOMMERA THARA BAI** (New name) **W/o. Satyanarayana**
NTZ-324920

CHANGE OF NAME

I, **GANAPURAM MEENAKSHI** W/o. Ganapuram Ravi, H.No.3-35, Ravutla, (M) Sirikonda, (D) Nzb. my minorson surname/Name changed **GANPOOR RANDITHYA to GANAPURAM RANDITHYA**
NTZ-324813

CHANGE OF NAME

I, **GANPOOR MEENAXI** W/o. GANPOOR RAVI H.No.3-35, Ravutla, (M) Sirikonda, (D) Nzb. changed name/ Surname as **GANAPURAM MEENAKSHI W/o. GANAPURAM RAVI**
NTZ-324813

DOCUMENT LOST

I, **SRI MANTHENA GANGARAM alias MANTHENNA SRINIVAS** S/o.Lingaiah, R/o.H.No.7-66, Vill: Mentrajpally, Mdl: Dichpally, Dist. Nizamabad. I Lost my original Registration Sale Deed Document No: 4417/2009,Dt: 14-12-2009 while travelling from Dichpally to Rampur on my Motor Cycle if any one found please contact **Cell:99852 35215**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉపాధి పనుల పరిశీలన

బిచ్కుంద/నాగిరెడ్డిపేట, మే 16: బిచ్కుంద మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ గురువారం పరిశీలించారు. బిచ్కుంద, మాన్యపూర్ గ్రామాలను సందర్శించి ఉపాధి హామీ కూలీల పని దినాలు, చేపట్టిన పనులను అడిగి తెలుసుకున్నారు. ఎండలు అధికంగా ఉన్నందున కూలీలు ఉదయం వేళ పనులు చేయాలని సూచించారు. ఎంపీడీవోవెంట టెక్నికల్ అసిస్టెంట్ సంజు తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం 3,400 మంది ఉపాధి కూలీలు పనులు చేపట్టారని ఈజీఎస్ ఏపీవో సాయి లు తెలిపారు. మండలంలోని 25గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగు తున్నాయని అన్నారు. ప్రతి గ్రామంలో 150 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని కూలీలకు సూచిస్తున్నామని తెలిపారు.

నాగిరెడ్డిపేట మండలం లింగంపల్లి కలాన్‌లో పనులు చేస్తున్న కూలీలు

విద్యుత్ తీగలపై తాడు

బిచ్కుంద, మే 16: మండల కేంద్రంలోని బస్టాండ్‌కు సమీపంలో ఉన్న విద్యుత్ తీగలపై కొన్ని రోజులుగా ఓ తాడు వేలాడుతున్నది. ఈ దారి మీదుగా లోడ్ వాహనాలు ప్రయాణిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి తాడును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

తీగ నుంచి వేలాడుతున్న తాడు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దకొడప్‌గల్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెద్దకొడప్‌గల్, మే 16: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రజలకు సైబర్ నేరాలపై గురువారం ఎస్సై కోనారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది వెంకటేశ్ మాట్లాడుతూ.. ఉచితాలకు ఆశపడి మోసపోవొద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరానికి గురైనా, సెల్‌ఫోన్లు పోయినా వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సాయి శివ, అంజి, రవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

పెద్ద కొడప్‌గల్, మే16: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఏఎస్సై రాములు హెచ్చరించారు. మండలంలోని పోచారం చౌరస్తాలో జాతీయ రహదారిపై గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు తమ వెంట అన్ని ధ్రువీకరణ పత్రాలను ఉంచుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జరిమానాలను ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది వెంకటేశ్, సాయిశివ, అంజి, రవి తదితరులు పాల్గొన్నారు.